క్లుప్తంగా

యుద్ధ ప్రాతిపదికన కాలువగండి పూడ్చివేత

భామిని: మండలంలోని బాలేరు రోడ్డులో ఏర్పడిన కాలువ గండిని యుద్ధప్రాతిపదికన బుధవారం పూడ్చివేశారు. జీసీసీ డిపో దాటిన తర్వాత చర్చి ముందు రోడ్డుపై ఏర్పడిన గండి కారణంగా అటువైపుగా ప్రయాణించేందుకు ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. గ్రామ చెరువుకు రోడ్డు కింది భాగం ద్వారా వెళ్లే ఈ కాలువ పైకప్పు కూలిపోవడంతో గండి ఏర్పడిందని, మరో కాంక్రీట్ ప్లేటు వేయించి, గండి పూడ్చివేసినట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. సర్పంచ్ జామి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి.

వాహనాల వేలం



వాహనాలను వేలం వేస్తున్న సెబ్ సిబ్బంది

కురుపాం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం వాహనాల వేలంపాట నిర్వహించినట్లు సెబ్ ఎస్ఐ బి.వి.ఎస్.ఎన్.భూషణరావు తెలిపారు. వివిధ ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను వేలం వేయగా, పాటదారులు వాటిని దక్కించుకున్నారన్నారు.

మూడో విడత కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐటీఐ సిబ్బంది

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో మిగులు సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించారు. మొత్తం 182 మంది దరఖాస్తు చేసుకోగా, 135 మంది హాజరయ్యారని, అయితే 28 మందికి మాత్రమే సీట్లు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు.

రూ.2.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



పైడి వీధిలో నిరిస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ కళావతి

సీతంపేట: స్థానిక పైడి వీధిలో రూ.2.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం బుధవారం చేపట్టారు. సర్పంచ్ ఎ.కళావతి, గ్రామ కార్యదర్శి సుదర్శనరావు ఈ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు ప్రజానిధుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

తొలగించిన ఓటర్ల జాబితా పునఃపరిశీలన



ఓటరు జాబితా పరిశీలనలో బీఎల్‌వోలు

భామిని: ఓటరు జాబితా నుంచి వివిధ కారణాల రీత్యా తొలగించిన ఓటరు జాబితాను బీఎల్‌వోలు బుధవారం పునఃపరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు సర్వే చేపట్టిన బీఎల్‌వోలు మృతి చెందిన వారి ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలను తొలగించారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు తొలగించిన ఆయా ఓట్లను మరోసారి బీఎల్‌వోలు పరిశీలించారు. పక్కాగా ఓటరు జాబితా తయారీకి ఈ కసరత్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఉప తహసీల్దార్ మల్లేశ్వరరావు

గరుగుబిల్లి: రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం సివిల్ సప్లైస్ ఉప తహసీల్దార్ హెచ్.మల్లేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో బుధవారం సమావేశమైన ఆయన ప్రతినెలా 1వ తేదీ నుంచి 17వ తేదీలోగా రేషన్ సరుకుల పంపిణీ చేపట్టాలన్నారు. సెప్టెంబర్ నెలలో బియ్యం, పంచదార, గోదుమపిండి సరఫరా చేయడం జరుగుతుందని, లబ్ధిదారులకు బియ్యం, పంచదారను తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు.

• గి'రాఖీ'



రాఖీ పండగ పురస్కరించుకుని, రాఖీల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. గురువారం రక్షాబంధన్ కావడంతో అక్కచెల్లెమ్మలంతా తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో రాఖీల అమ్మకాలతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. రూ.20 దగ్గర నుంచి రూ.100, రూ.200, రూ.300 విలువైన రాఖీలు అందుబాటులో ఉండగా, వాటిని కొనుగోలు చేసేందుకు మహిళలు ఉత్సాహం కనబరుస్తున్నారు. –పాలకొండ రూరల్

• ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని పూతికవలస గ్రామంలో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం బుధవారం పర్యటించింది. వారు అక్కడి ప్రజల జీవన విధానం, వారు అవలంబిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై అధ్యయనం చేశారు. ప్రధానంగా పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు వినియోగించే ఘన, ద్రవజీవామృతాల తయారీతో పాటు వివిధ కషాయాల తయారీ, వాడుక గురించి, అడిగి తెలుసుకున్నారు. వారికి రీజనల్ ఆఫీసర్ ప్రకాష్, ఎంపీడీవో సత్యం, పీఏవో హరికృష్ణ, డీపీఎం షణ్ముఖరాజు, అడిషనల్ డీపీఎం ధనుంజయ వాటి గురించి వివరించారు. –సీతంపేట



• చవితికి సన్నద్ధం..



పల్లెలు, పట్టణాల్లో వినాయకచవితి సందడి ప్రారంభమైంది. సెప్టెంబర్ 18వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో వినాయక విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. విజయవాడ, రాజమండ్రి, విజయనగరం ప్రాంతాల నుంచి వ్యాపారులు విగ్రహాలను తీసుకువచ్చి,అమ్ముతున్నారు. ఒక్కో విగ్రహం పరిమాణం బట్టి రూ.10 వేల దగ్గర నుంచి రూ.25 వేల వరకు ధర పలుకుతోంది. ఉత్సవ కమిటీలు కూడా విగ్రహాల కొనుగోళ్లకు సిద్ధమవుతుండడం విశేషం. –వీరఘట్టం

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలి

• నగర పంచాయతీ సాధారణ సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ: నగరపంచాయతీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులంతా కృషి చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. మండల కేంద్రంలో నగరపంచాయతీ సాధారణ సమావేశం బుధవారం జరిగింది. నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధా కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పట్టణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐదో వార్డు కౌన్సిలర్ వెలమల మన్మథరావు మాట్లాడుతూ పట్టణంలోని తాగునీటి కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోందని, అలాగే పట్టణంలోని పంచాయతీ స్థలాలకు రక్షణ కల్పించాలన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ కంద్రోతు లక్ష్మి తన వార్డు పరిధిలో తాగునీటి కుళాయిలు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని వినతించారు. అలాగే వడమ కోనేరును లీజుకు ఇచ్చే విషయంలో నిబంధనలు పాటించాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

• సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కురుపాం: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలంతా ఏకమై, తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గుమ్మిడిగూడ, దండుసూర, షేక్‌పాడు తెన్నుఖర్జ, గొటివాడ, నేరేడువలస, దురుబిలి గిరిజన గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోదీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ట్రూ అప్ చార్జీ పేరిట విద్యుత్ చార్జీలు ప్రతినెలా పెంచుతోందని విమర్శించారు. ఇంధన ధరలు కూడా విపరీతంగా పెంచుతోందన్నారు. 2014లో అధికారంలోకి రాకముందు మోదీ తాము అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, అధికారం చేపట్టిన తర్వాత ఆ మాటను విస్మరించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా ఆయన 50 వేల మంది ఉద్యోగులను తొలగించారన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా ఈ నెల 31వ తేదీన కూడా సంతకాల సేకరణ చేసి, సెప్టెంబర్ 1వ తేదీన సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తామని, నాలుగో తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలను కోరారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

• జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్



పొలంబడి కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

గరుగుబిల్లి: సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని సంతోషపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. సేంద్రియ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చన్నారు. గుమ్మలక్ష్మీపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నిర్మల జ్యోతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని కోరారు. జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎకరానికి 4 నుంచి 5 లింగాకర్షణ బుట్టలు, పసుపురంగు ప్లేట్లు, దీపపు ఎరలను ఏర్పాటు చేస్తే పంటలను ఆశించే పురుగులను నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎం షణ్ముఖరాజు, వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి, టెక్నికల్ ఏవో హర్షలత, జట్టు ఎఫ్‌పీఓ ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: నిరుపేదలకు కేటాయించిన ఇళ్లస్థలాలను ఇంద్రాని క్లస్టర్ రైస్‌మిల్లు అసోసియేషన్ ప్రైవేట్ లిమిటెడ్, కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి ఇవ్వవద్దని నాగూరు గ్రామ సర్పంచ్ కేతిరెడ్డి శిరీష కోరారు. ఇదే విషయమై ఆమె మండల తహసీల్దార్ జి.వి.జనార్దన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ సమీపంలోని పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఐదెకరాల స్థలంలో ఎంఎస్‌ఈపీడీపీ పథకం కింద కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి పంచాయతీ తీర్మానం ఇవ్వాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తెలియజేశారన్నారు. సర్వే నంబర్ 102–1లో ఉన్న భూమి నిరుపేదల ఇంటి స్థలాలకు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇదే స్థలంలో గ్రామంలోని 40 రజక కుటుంబాలకు సంబంధించి, దోబీ ఖానాల నిర్మాణానికి కూడా కొంత స్థలం కేటాయించేందుకు పంచాయతీ తీర్మానం చేయడం జరిగిందని స్పష్టం చేశారు. అందరికీ ఉపయోగకరమైన స్థలంలో కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి స్థలం కేటాయించవద్దన్నారు. ఆమె వెంట నాయకులు కె.అచ్యుతరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాల బోధన



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో నాగభూషణరావు

జియ్యమ్మవలస: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాల బోధన చేపట్టాలని ఎంఈవో ఎన్.నాగభూషణరావు సూచించారు. మండలంలోని జియ్యమ్మవలస, పెదమేరంగి గ్రామ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకునే అంశాలను చక్కగా నేర్చుకుని, విద్యాబోధనలో అనుసరించాలని తెలిపారు. ఏ పాఠం ఏ బోధనా పద్ధతిలో బోధిస్తే విద్యార్థికి బాగా అర్థమవుతుందన్న విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ డిప్యూటీ ఈవో లిల్లీరాణి

సీతంపేట: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఐటీడీఏ డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి సూచించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించిన ఆమె అక్కడి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. నెలవారీ సిలబస్‌ను పక్కాగా పూర్తి చేయాలని, ఎఫ్ఏ–2 పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని తెలిపారు. వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్‌ను విద్యార్థులతో రాయించి, దిద్దాలన్నారు. అనంతరం మల్లి బాలుర ఆశ్రమ పాఠశాలకు వెళ్లిన ఆమె అక్కడి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

తెర్లాం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి కె.గోవిందమ్మ సూచించారు. మండలంలోని పెద పాలవలస గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంలో వరిసాగు–యాజమాన్య పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనశుద్ధి దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు అవలంభించాల్సిన అన్ని యాజమాన్య పద్ధతులను తెలుసుకోవాలన్నారు. అలాగే సూడోమోనాస్(జీవన శిలీంద్రనాశిని)ఉపయోగం, నీటిఎద్దడిపై తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, దానిని ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఎ.సింహాద్రినాయుడు, ఏఈవో ఇందిర పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

• ఐటీడీఏ పీవో కల్పనాకమారి

సీతంపేట: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమావేశమైన ఆమె నిర్మాణ దశలోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణదారులకు కావాల్సిన నీరు, విద్యుత్, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో చేపడుతున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలను పూర్తి చేయాలన్నారు.

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించాలి



నీలానగరం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న తెలుగు ఉపాధ్యాయులు

వీరఘట్టం: విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించాలని ఎంఈవో ఆర్.ఆనందరావు సూచించారు. మండలంలోని నీలానగరం, వీరఘట్టం జెడ్పీ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించిన ఆయన అక్కడి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న సరికొత్త బోధనా విధానాలు, మెలకువలు బాగా నేర్చుకుని, విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో నీలానగరం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జి.రవిప్రసాద్, వీరఘట్టం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సొంబర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చురుగ్గా భూ సర్వే

రాజాం: గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష సర్వే చురుగ్గా జరుగుతోంది. రాజాం మండలంలో 21 గ్రామాల్లో అధికారులు ప్రాథమిక సర్వేను పూర్తి చేశారు. 14 గ్రామాల్లో హద్దురాళ్లు వేశారు. హద్దురాళ్లు పూర్తయిన గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను రైతులకు అందిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.కె.రాజు తెలిపారు.

తాగునీటి సరఫరాకు ప్రణాళికలు

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో శివారు వీధులకు కూడా తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. రాజాం పట్టణంలో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఇందిరమ్మ కాలనీలో తాగునీటి ఇబ్బందులపై ఆరా తీసి, వాటర్ ట్యాంకు ఏర్పాటుకు స్థల పరిశీలన జరిపారు. పట్టణంలో తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించి, అమృత స్కీంలో భాగంగా తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ స్కీం ద్వారా అదనపు నిధులు వస్తాయని, వాటర్ ట్యాంకులు కొత్తవి నిర్మించి, తాగునీటిని ప్రజలకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ పి.వెంకట్, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ భాగ్యలక్ష్మి, సర్వేయర్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణా తరగతులు



రాతపరీక్షలో నిమగ్నమైన 108 సిబ్బంది

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 108 సిబ్బంది(ఈఎంటీలు, పైలట్‌లు)కి బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. గుండెపోటుకు గురైన వారితో పాటు రోడ్డు ప్రమాదాల కారణంగా తీవ్రంగా గాయపడి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారికి అందించాల్సిన ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం సిబ్బందికి రాతపరీక్ష నిర్వహించి, వారికి విషయం ఎంతమేర అర్థమైందోనన్న విషయం తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ ఎస్.మన్మథరావునాయుడు, డివిజన్ ఓఈ బి.విజయ్‌కుమార్, ఓజేటీ ఆలుబిల్లి శ్రీనివాసరావు, సిబ్బంది గణపతి, కాంబాబు, రాజు, రవిబాబు, సంగమేష్, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రాజాం సిటీ: ఉపాధి హామీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలు, సీఓలతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవనం, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. గ్రామ స్థాయిలో రికార్డులు శతశాతం అప్‌డేషన్ చేయాలని, వేతనదారులకు 90 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కెపాసిటీ బిల్డింగ్ కోర్స్ డైరెక్టర్ చిన్నంనాయుడు, ఏపీఓ కె.సాయిరాం, ఈసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.6.80 కోట్లతో నూతన భవనం

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద రూ.6.80 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు. రోగులకు అత్యవసర సేవలతో పాటు ఆధునిక వైద్య సేవలందేలా ఏడాది క్రితం నిర్మాణం ప్రారంభించామని, త్వరలోనే ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి వెల్లడించారు.

ఆర్థిక నిర్వహణపై అవగాహన అవసరం

రాజాం : మండలంలో ప్రతీ మహిళా సంఘ అధ్యక్షులు తమ సంఘాల ఆర్థిక నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని, సంఘానికి ఆర్థికంగా బలోపేతం చేయగలగాలని వైఎస్ఆర్ క్రాంతి పథం రాజాం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి సూచించారు. స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం భవనంలో మండలంలో గ్రామైక్య సంఘ అధ్యక్షులకు బుధవారం సమావేశం నిర్వహించి శిక్షణ ఇచ్చారు. అలాగే ప్రతీ గ్రామ సంఘానికి సంబంధించిన అధ్యక్షులు ఆర్థిక మేనేజ్‌మెంట్ చేయడం, వాటిని నిర్వహించడంపై అవగాహన కల్పించారు.